క్లుప్తంగా

మంత్రి లోకేష్ దళితులకు క్షమాపణ చెప్పాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కారంచేడు హత్యా కాండకు కారణమైన దగ్గుపాటి చెంచు రామయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేష్ దళితులకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు తోకల శ్యామ్‌కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కారంచేడులో ఆరుగురు దళితులను దారుణంగా నరికి చంపి, ముగ్గురు మహిళలను చెరచిన ఘటనకు కారకుడైన దగ్గుబాటి చెంచురామయ్య మీకు ఆదర్శనీయుడా అని ప్రశ్నించారు. రాజ్యాంగ పదవుల్లో కొనసాగుతూ ఇలాంటి పనులు చేస్తూ సమాజానికి మీరు ఏమని సందేశాన్ని ఇస్తున్నారని నిలదీశారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఉచిత శిక్షణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ఈనెల 30వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఆ కళాశాల ఇంటర్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ టెక్కెం విజయ బాబు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్‌లోని అన్ని గ్రూపు సబ్జెక్ట్‌లకు శిక్షణ ఇస్తామని, ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 7995250842/ 8106158174లలో సంప్రదించాలని కోరారు.

గడిచిన ఏడాది సంతృప్తినివ్వలేదు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గడిచిన ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి పనులు తనకు సంతృప్తి ఇవ్వలేదని, రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేయటమే తన లక్ష్యమని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు సుజనాచౌదరి అన్నారు. నియోజకవర్గంలో సుమారు ఏడు కోట్ల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సుజనాచౌదరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం కోసం రూ.7కోట్ల అంచనాలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూటమి నేతలతో కలిసి స్థానిక పంజా సెంటర్‌లో శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, అర్షద్, ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) గుడివాడ నరేంద్ర రాఘవ, మరుపిళ్ల రాజేష్, అత్తలూరి ఆదిలక్ష్మి పెద్దబాబు, మహాదేవు అప్పాజీరావు తదితరులు పాల్గొన్నారు.

పెరటి మొక్కల పెంపకంపై అవగాహన

ఇబ్రహీంపట్నం: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు పెరటి మొక్కల పెంపకంపై స్థానిక మూడో సచివాలయం వద్ద అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. మెప్మా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) శ్రీధరరావు పెరటి మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. విజయవాడ సిటీ టెర్రస్ గార్డెన్ సంస్థ ప్రతినిధి పద్మజ వంట గది వ్యర్థాలతో వర్మికంపోస్ట్ తయారీ, ద్రవ ఎరువుల తయారీ విధానాన్ని వివరించారు. మొక్కలకు ఆశించే చీడపీడలు, వాటి నివారణ మార్గాలను తెలిపారు. వివిధ రకాల కూరగాయ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీటీజీ సభ్యులు వంగూరు ప్రకాశ్, ఆలూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





జయ జయహే జగన్నాథ

ప్రసిద్ధి గాంచిన జగన్నాథ రథయాత్ర శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురంలోని లేబర్‌కాలనీ గ్రౌండ్ నుంచి దాదాపు 6 కిలోమీటర్ల మేర సాగింది. మంగళ వాయిద్యాలు, మహిళల కోలాటాల నడుమ జగన్నాథుడు, బలభద్రుడు - సుభద్రాదేవి వేంచేసి ఉన్న రథం పుర వీధులగుండా వెళుతుండగా భక్తులు రోడ్లపై రంగవల్లులను తీర్చిదిద్ది స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





నిరుపయోగంగా 'యూజీడీ'

- మ్యాన్‌హోల్స్ నిర్మాణం సరే.. కనెక్షన్లు ఏవి?
- మరుగుదొడ్ల నుంచి అవుట్‌లెట్ల ద్వారా డ్రెయిన్‌లోకి..
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు



కొట్టేటి కోటయ్య వీధిలో నిర్మించి వదిలేసిన మ్యాన్‌హోల్స్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో భూగర్భ డ్రెయినేజీ కోసం నగరపాలక సంస్థ పలు డివిజన్లలో కోట్లాది రూపాయల ప్రజాధనంతో మ్యాన్‌హోల్స్ నిర్మించింది. అదేదో సినిమాలో 'తాళం వేసితిని.. గొళ్లెం మరిచితిని' అన్న చందంగా రోడ్ల మధ్యలో మ్యాన్‌హోల్స్ నిర్మించారు గానీ అనేక ప్రాంతాల్లో అక్కడ నుంచి గృహాలకు మాత్రం కనెక్షన్లు ఇవ్వటాన్ని విస్మరించారు. గతంలో ప్రతి ఇంట్లో సెప్టిక్ ట్యాంక్ నిర్మించుకుని మరుగుదొడ్ల నుంచి వ్యర్థాలు అందులోకి వెళ్లేలా ఏర్పాటు చేసుకునేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ వచ్చిననాటి నుంచి నగరపాలక సంస్థ ఆ దిశగా ప్రజలకు సౌకర్యాన్ని కల్పించాలన్న ఆలోచనతో ఏర్పాట్లు చేయటం హర్షణీయమే. అయితే పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన రహదారులతో పాటు వాటికి అనుసంధానంగా ఉన్న అనేక కాలనీల్లోని గృహాలకు మాత్రం ఇంత వరకు కనెక్షన్‌లు ఇవ్వకపోవడం గమనార్హం. వాస్తవానికి మెయిన్ లైన్ల నుంచి అంతర్గత రోడ్లలో నిర్మించిన మ్యాన్‌హోల్స్‌కు కనెక్షన్ కలపాల్సి ఉంది. దశాబ్దాలు గడుస్తున్నా గట్టు వెనుక ప్రాంతంలో పలుచోట్ల ఇళ్లకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో గతంలో మాదిరిగా సెప్టిక్ ట్యాంక్‌లే శరణ్యమయ్యాయి.

మరుగుదొడ్ల నుంచి డ్రెయిన్‌లోకి..

విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని రోటరీ నగర్, బ్రహ్మయ్య కాలనీ, భగత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని ఇళ్లకు యూజీడీ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో నూతనంగా నిర్మించుకున్న భవన యజమానులు సైతం వ్యక్తిగత మరుగుదొడ్ల నుంచి డ్రెయిన్‌లోని అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆయా అవుట్‌లెట్ల నుంచి మలంతో కూడిన చెడు నీరంతా డ్రెయిన్‌లోకి వస్తుండటంతో భరించలేని దుర్వాసన వచ్చి ఉండలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో యూజీడీ కనెక్షన్ కోసం కొంత మొత్తాన్ని చెల్లించాలని నగరపాలక సంస్థ విస్తృతంగా ప్రచారం చేసిందని, ఆ సమయంలో రోటరీనగర్‌లోని తాము చెల్లించామని కొంత మంది చెబుతున్నారు. ఇప్పటికీ మూడు పర్యాయాలు రోటరీనగర్‌లో రోడ్లు నిర్మించారని, ప్రతి సారి మ్యాన్‌హోల్స్ ఎత్తు పెంచుతూ వెళ్లారుగానీ ఇప్పటి వరకు కనెక్షన్ ఇవ్వలేదని వాపోతున్నారు. కాగా సితార జంక్షన్ నుంచి రోటరీనగర్ వరకు విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలో ఎవరి ఇంటికి యూజీడీ కనెక్షన్ ఇవ్వలేదు.

రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వాహనాల రాకపోకలను ఆటంకం కలిగేలా రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవని మూడో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. కిషోర్‌బాబు వ్యాపారులను హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ పర్యవేక్షణలో మూడవ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది కేదారేశ్వరపేట, సీకేరెడ్డి రోడ్డు ప్రాంతాల్లో రోడ్ల ఆక్రమణలపై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్న పండ్లు, కూరగాయలు, చెక్క వ్యాపారులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. వ్యాపారులు తమ సామగ్రిని రోడ్ల మీద నుంచి తొలగించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. సీకే రెడ్డి రోడ్డు నగరంలోనే ఒక ముఖ్యమైన రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుందన్నారు. ఆక్రమణల ద్వారా ఈ రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలని వినతి

పెనమలూరు: అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇంటర్మీడియెట్ ప్రాంతీయ అధికారి (ఆర్‌ఐవో)కు పీడీఎస్‌యు నేతలు వినతిపత్రం అందజేశారు. కానూరులో శుక్రవారం ఆర్‌ఐవోకు ఫిర్యాదు చేసిన పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ మాట్లాడుతూ శ్రీచైతన్య, నారాయణ, ఎస్ఆర్, భాష్యం, గోసాలైట్స్ వంటి కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలలు ధనార్జనే ధ్యేయంగా ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. అధిక ఫీజుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు మోసపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్య పుస్తకాలు, డ్రస్ అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. ఒక బ్రాంచికి అనుమతులు తీసుకొని మరికొన్ని బ్రాంచ్‌లు నడుపుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే కాలేజీల యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నగర అభివృద్ధికే ప్రాధాన్యం



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, అవుతు శైలజ, ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): తాము అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు విజయవాడ నగరాన్ని చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్నామని నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ప్రణాళికబద్ధంగా నిధుల కేటాయింపులు, మంజూరు చేసి అన్ని వర్గాలకు, అన్ని డివిజన్లకు సమానంగా అభివృద్ధి ఫలాలు అందించామని స్పష్టం చేశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఫ్లోర్ లీడర్ చాంబర్లో డెప్యూటీ మేయర్లు బెల్లందుర్గ, అవుతు శైలజారెడ్డి, ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యంతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. తాము కౌన్సిల్‌లో కొలువుదీరిన 2021 నుంచి ఇప్పటి వరకు మొత్తం 24 కౌన్సిల్స్ జరిగాయని, పార్టీలకతీతంగా నగరంలోని 64 డివిజన్లను పోటీపడి అభివృద్ధి చేశామని ఈ సందర్భంగా మేయర్ చెప్పారు. ఉద్యోగుల సమస్యల నుంచి అనేక అంశాలు పరిష్కరించామని గుర్తు చేశారు.

కూటమి పాలనలో కుంటుపడిన అభివృద్ధి..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన గతేడాది నుంచే నగరంలో అభివృద్ధి కుంటుపడిందని మేయర్ చెప్పారు. బుడమేరు వరదల అనంతరం నగరంలోని 100 పనులకు టెండర్లు, కాంట్రాక్టు కేటాయింపులు చేస్తే కేవలం వాటిలో 15 పనులు మాత్రమే జరుగుతున్నాయని వివరించారు. అయితే కేవలం కొంతమంది స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకొస్తున్న అంశాలను మాత్రం ఇటీవల జరిగిన కౌన్సిల్లో తిరస్కరించామని స్పష్టం చేశారు.

నాడూ తిరస్కరించారు..

ఐలా పరిధిలో ఉన్న ఏపీఐఐసీ కాలనీలోని జవాక్ (జవహర్ ఆటోనగర్ మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ స్టోర్స్)కు తాగునీరు ఇవ్వాలని వచ్చిన ప్రతిపాదనపై.. ఐలా నుంచి వీఎంసీకి రావాల్సిన బకాయిలు రూ. 25 లక్షలు చెల్లించాలని, దీనిపై సంబంధిత సంస్థ నుంచి ఎలాంటి సంప్రదింపులు లేకుండా నీరు సరఫరా చేయకూడదని తిరస్కరించామని మేయర్ చెప్పారు. ఇదే అంశాన్ని 2014–19 టీడీపీ కౌన్సిల్ సమయంలో కూడా అప్పటి మేయర్ కోనేరు శ్రీధర్ కూడా తిరస్కరించారని.. అప్పుడు రాని అభ్యంతరం ఇప్పుడు ఎందుకు వస్తోందని ఆమె ప్రశ్నించారు.

నాడు–నేడు అభివృద్ధి చూడండి..

వైఎస్సార్‌సీపీ వీఎంసీ ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యం మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని 2021 వరకు చేసిన అభివృద్ధి, 2021 తర్వాత చేసిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని చెప్పారు. డెప్యూటీ మేయర్ బెల్లందుర్గ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేయాలని వచ్చిన ప్రతిపాదనలో లోటుపాట్లను కూడా తెలుసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తే అంబులెన్సుల రాకపోకలకు, వాహనాల పార్కింగ్‌కు సమస్య ఉత్పన్నమవుతుందని, దీన్ని పరిగణనలోకి తీసుకునే తాము తిరస్కరించామన్నారు.

బస్టాండ్ ఏర్పాటు చేయాలి..

డెప్యూటీ మేయర్ అవుతుశైలజ రెడ్డి మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో తాము వచ్చాకే అభివృద్ధి చేశామని చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో బస్‌స్టాండ్ ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను ఈ ప్రభుత్వం రద్దు చేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పెరుగుతున్న వాహనాలు, ట్రాఫిక్ దృష్ట్యా ఈ ప్రాంతంలో బస్టాండ్ అవసరమని అన్నారు. ఈ ప్రభుత్వం దీన్ని రద్దుచేసి చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించటం హేయమని పేర్కొన్నారు.

రామరాజ్యనగర్‌లో విరిగిపడిన కొండ చరియలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల్లో ప్రమాదాలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని రామరాజ్యనగర్ కొండ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడి దిగువన ఉన్న బాబూరావు ఇంటిపై పడటంతో ధ్వంసం అయ్యింది. ఆయన ఇంటి వద్దగల బైక్‌తోపాటు ఇంట్లోని వాషింగ్ మిషన్ ఇతర వస్తువులపై చరియలు పడటంతో పూర్తిగా పాడైపోయాయి. విషయం తెలిసిన కోటేశ్వరరావు వెంటనే పశ్చిమ తహసీల్దార్, నగరపాలక సంస్థ అధికారులకు సమాచారం అందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆస్తి నష్టం జరిగిన వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, స్థానిక పార్టీ నాయకులు యరసాని జోసఫ్ పాల్గొన్నారు.



కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కోటేశ్వరరావు

కూటమి నేతలను నిలదీయాలి

స్మార్ట్ మీటర్లపై సీపీఎం పోరుబాట

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుతో ప్రజలను పీల్చి పిప్పి చేస్తోందని.. దీనిపై ప్రజాప్రతినిధులను, కూటమి నేతలను నిలదీయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. విజయవాడ న్యూరాజరాజేశ్వరిపేటలో శుక్రవారం స్మార్ట్ మీటర్లపై సీపీఎం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి తొలి అడుగే తప్పటడుగు అన్నారు. కుటుంబ సభ్యులందరూ రోజంతా పనుల్లోకి వెళ్లి నివాసంలో లేకపోయినా వందల రూపాయలు బిల్లులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల ఖజానా నింపడానికి సామాన్యులపై విద్యుత్ బిల్లులు పెంచడం తగదని అన్నారు. స్మార్ట్ మీటర్లను అడ్డుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఏడాది కూటమి పాలనలో తమ ఘనత గురించి చెప్పడానికి జూలై ఒకటో తేదీ నుంచి వచ్చే ప్రజాప్రతినిధులను, కూటమి నేతలను విద్యుత్ చార్జీలపై నిలదీయాలని సూచించారు.

స్మార్ట్ మీటర్లపై మాట తప్పిన పాలకులు

ప్రజలకు సంక్షేమ పథకాలతో నగదు ఇవ్వకపోగా, విద్యుత్ బిల్లుల రూపంలో ప్రజల నుంచే ప్రభుత్వం వసూలు చేయడం దారుణమన్నారు. ఇదేనా కూటమి ప్రభుత్వం సాధించిన విజయం? అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లపై పాలకులు మాట తప్పారని పేర్కొన్నారు. నమ్మకద్రోహం చేసిన కూటమి నేతలను ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. మోదీ ప్రభుత్వ ఆదేశాలతో ఆదాని, కార్పొరేట్ కంపెనీలు రాష్ట్ర ప్రజలను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు.

ఈ సందర్భంగా రాజరాజేశ్వరిపేటకు చెందిన బి. సైదులమ్మ తమ విద్యుత్ బిల్లు రూ.609, అదనపు సర్దుబాటు చార్జీలు రూ. 357 మొత్తం కలిపి రూ. 966 బిల్లు వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీ రమణరావు, టీ శ్రీనివాస్, ఎంపీ రమణ తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరిపేటలో విద్యుత్ బిల్లును చూపుతున్న సీపీఎం నాయకుడు బాబూరావు





మనసారా.. కొలి 'సారె'

ఆషాఢ మాసోత్సవాలు, శుక్రవారం నేపథ్యంలో దుర్గమ్మ సన్నిధి భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి పెద్ద ఎత్తున హాజరైన భక్తులు, భక్త బృందాలు సారెను సమర్పించాయి. భక్తితో ప్రణమిల్లాయి. దీంతో మహా మండపం ఆరో అంతస్తులో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







ఘాట్‌రోడ్డులో మొబైల్ ఏటీఎం సేవలు



బస్సు డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఘాట్ రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద శుక్రవారం నుంచి కెనరా బ్యాంక్ తన ఏటీఎం సేవలను ప్రారంభించింది. ఓం టర్నింగ్ వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ ఏటీఎంను దుర్గగుడి ఈవో శీనానాయక్ శుక్రవారం ప్రారంభించారు. మొబైల్ ఏటీఎం కౌంటర్‌కు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఈవో రిబ్బన్ కట్ చేసి సేవలను ప్రారంభించారు.

సద్వినియోగం చేసుకోవాలి..

అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత రవాణా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో శీనానాయక్ సూచించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నడుపుతున్న ఉచిత బస్సులు, బ్యాటరీ వాహనాలు, వ్యాన్‌లను ఈవో శుక్రవారం తనిఖీ చేశారు.